లాభదాయకంగా మొక్కజొన్న

- బోరుబావుల కింద మొక్కజొన్న సాగుకు రైతుల మొగ్గు
- ఖరీఫ్‌లో 3,445 ఎకరాల్లో పంట
- అన్నదాతకు అండగా ఆర్బీకే సిబ్బంది

మడకశిరరూరల్: మడకశిర వ్యవసాయశాఖ డివిజన్ పరిధిలోని రైతులు మొక్కజొన్న సాగు ఆసక్తి కనబరుస్తున్నారు. బోరు బావుల కింద పంట సాగుకు మొగ్గు చూపుతున్నారు. ఇందులో భాగంగానే గతంలో ఎన్నడూ లేని విధంగా ఖరీఫ్‌లో బోరు బావుల కింద మడకశిర డివిజన్‌లో 3,445 ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేశారు. ప్రభుత్వం కూడా పంట పండించిన రైతులు నష్టపోకుండా గిట్టుబాటు ధర కల్పిస్తూ రైతులకు అండగా నిలుస్తోంది.

ఎకరాకు 25 క్వింటాళ్ల దిగుబడి

మార్కెట్‌లో మంచి ధర ఉండటంతో రైతులు ఈ పంట సాగు వైపు దృష్టి సారించారు. ఒక ఎకరాలో మొక్కజొన్న సాగుకు రూ.15 వేల నుంచి రూ.20 వేలు ఖర్చు అవుతుంది. ఒక ఎకరాకు దాదాపు 25 క్వింటాళ్ల వరకూ దిగుబడి వస్తుంది. నాణ్యతను బట్టి క్వింటాల్ రూ.2,250 నుంచి రూ.2,500 దాకా ధర పలుకుతోంది. ఈ లెక్కన రూ.62,500 ఆదాయం లభిస్తోంది. ఖర్చులు తీసేస్తే రూ.42,500 చేతికి వస్తోంది. మరోవైపు గ్రాసం అమ్మడం ద్వారా కూడా రైతులు ఆదాయం పొందుతున్నారు.

రైతుకు అండగా ఆర్బీకే సిబ్బంది

ప్రభుత్వం గ్రామస్థాయిలోనే వ్యవసాయ, అనుబంధశాఖ పంటలు సాగు చేసే రైతులకు ఎప్పటికప్పుడు వ్యవసాయ సూచనలు, సలహాలు అందించాలని ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ఆర్బీకే సిబ్బంది గ్రామాల్లో పర్యటించి రైతులకు అవసరమైన వ్యవసాయ సూచనలు, సలహాలను అందిస్తూ పంటల సాగును ప్రోత్సహిస్తున్నారు. పంటకు తెగులు సోకితే వెంటనే నివారణ చర్యలు సూచిస్తూ అండగా నిలుస్తున్నారు.


మార్కెట్‌కు తరలించడానికి సిద్ధం చేస్తున్న మొక్కజొన్న విత్తనాలు

ఆదాయం బాగుంది


బోరు బావి కింద ఖరీఫ్‌లో సాగు చేసిన మొక్కజొన్న పంటలో మంచి దిగుబడి వచ్చింది. ఎకరాకు రూ.20 వేల ఖర్చు పెట్టి రెండు ఎకరాల్లో సాగు చేసిన మొక్కజొన్న పంటకు తెగుళ్లు వ్యాపించలేదు. 50 క్వింటాళ్లకు పైగా దిగుబడి వచ్చింది. క్వింటాల్ రూ. 2,250 చొప్పున విక్రయించాను. ఖర్చులు పోనూ ఎకరాకు రూ.35 వేల ఆదాయం వచ్చింది. – శ్రీరామరెడ్డి, రైతు, ఎల్లోటి, మడకశిర

సాగు విస్తీర్ణం పెరిగింది


వ్యవసాయ బోరు బావుల్లో భూగర్భ జలమట్టం పెరగడంతో రైతులు ఉత్సాహంగా ఖరీఫ్‌లో పంటలు సాగు చేశారు. మొక్కజొన్న సాగు విస్తీర్ణం ఎక్కువగా పెరిగింది. గతంలో ఈ స్థాయిలో పంట సాగు ఎప్పుడు లేదు. పంటకు తెగుళ్లు సోకినా సూచనలు, సలహాలు ఇస్తూ నివారణ చర్యలు సూచిస్తున్నాం. – తిమ్మప్ప, ఏఓ, మడకశిర

క్లుప్తంగా

డాక్యుమెంట్ రైటర్ల నిరసన


నిరసన తెలియజేస్తున్న డాక్యుమెంట్ రైటర్స్

హిందూపురం: స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌శాఖ నూతనంగా ప్రవేశపెడుతున్న కార్డు ప్రైమ్ 2.0 సాఫ్ట్‌వేర్‌కు వ్యతిరేకంగా డాక్యుమెంట్ రైటర్లు పెన్‌డౌన్ ప్రకటించి నిరసనకు దిగారు. రెండు రోజుల నిరసనల్లో భాగంగా బుధవారం స్థానిక సబ్‌రిజిస్టర్ ఆఫీసు దగ్గర ఆందోళన చేపట్టారు. ప్రభుత్వ నిర్ణయంతో ఒరిజినల్ దస్తవేజులు లేకుండా డౌలోడ్ దస్తావేజులతో భవిష్యత్తులో అనేక న్యాయపరమైన సమస్యలు ఉత్పన్నం అవుతాయన్నారు. కార్యక్రమంలో డాక్యుమెంటరీ రైటర్స్ సంఘ నాయకులు షబ్బీర్, రషీద్, లక్ష్మీనారాయణ, మన్సూర్, ఇసాక్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు చనిపోకుండా చూడాలి

అమరాపురం: మండలంలో వివిధ గ్రామాల్లోని రైతులకు పంపిణీ చేసిన మొక్కలు చనిపోకుండా చూసే బాధ్యత రైతులు, ఉపాధి సిబ్బందిదేనని ఎంపీడీఓ మునిస్వామి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ పనులు, రికార్డుల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందికి పలు సూచనలు, సలహాలిచ్చారు.

సర్వే వేగవంతం చేయాలి


మాట్లాడుతున్న కమిషనర్ ప్రమోద్‌కుమార్

హిందూపురం: పట్టణంలోని జనరల్ ఎన్‌రోల్‌మెంట్ సర్వే వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ అన్నారు. బుధవారం మున్సిపల్ ఆఫీసులో సీఆర్‌పీసీ, సచివాలయ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. జనరల్ ఎన్‌రోల్‌మెంట్ సర్వే నత్తనడకన సాగుతోందని విద్యాకార్యదర్శులు బాధ్యతగా తీసుకుని పూర్తిచేయాలన్నారు.

ఈ-సర్వీసెస్ వేగవంతం చేయండి

రొళ్ల: రాష్ట్ర ప్రభుత్వం సచివాలయాల ద్వారా అందిస్తున్న ఈ–సర్వీసెస్‌ను వేగవంతం చేయాలని పెనుకొండ డీఎల్‌డీఓ శివారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని మల్లినమడుగు, బీజీ హళ్లి, రొళ్ల–1, 2, హులికుంట సచివాలయాలను ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు తనిఖీ చేపట్టారు. ఆ తర్వాత రత్నగిరి కొల్హాపురి మహాలక్ష్మీదేవి అమ్మవారిని దర్శించుకున్నారు.

వర్షం కోసం వరుణ జపం


పుష్కరిణిలో వరుణ జపం చేస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: వరుణ దేవుడు కరుణించి ఎండుతున్న పంటలను కాపాడాలని కోరుతూ బుధవారం సాయంత్రం నీలకంఠాపురంలోని నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో పురోహితులు వరుణ జపం నిర్వహించారు. ఆలయ ఆవరణంలోని పుష్కరిణిలో పురోహితులు 1,108 సార్లు సాముహిక వరుణ జపం నిర్వహించారు.

నాణ్యమైన విద్యనందించాలి

అమరాపురం: ఉపాధ్యాయులు తరగతి గదిలో విద్యార్థుల స్థాయికి తగ్గట్టు నాణ్యమైన విద్యను అందించాలని వలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు శ్రీనివాస్ మూర్తి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని హేమావతిలో ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులకు ఆయన అవగాహన కల్పించారు.

విద్యార్థులకు బహుమతులు

అమరాపురం: మండలంలోని వలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రీడా దినోత్సవం సందర్భంగా మంగళవారం విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు ఆ పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాస మూర్తి ఆధ్వర్యంలో పీఈటీ, తదితరులు బుధవారం బహుమతులు అందజేశారు.

సబ్సిడీపై ఉలవల పంపిణీ


సబ్సిడీపై ఉలవలు పంపిణీ చేస్తున్న దృశ్యం

అమరాపురం: మండల కేంద్రంలోని గ్రామ సచివాలయంలో బుధవారం మద్దనకుంట గ్రామ పంచాయతీ రైతులకు వీపీఏ మహలక్ష్మి సబ్సిడీపై ఉలవలను పంపిణీ చేశారు. మొత్తం వంద మంది రైతులకు ఉలవలను అందజేశారు.

నారా లోకేష్‌పై ఫిర్యాదు


రొళ్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రొళ్ల: 'రెండు రోజుల క్రితం యువగళం పాదయాత్రలో టీడీపీ అధినేత చంద్రబాబు తనయుడు నారా లోకేష్ 2019 నుంచి 2024 వరకు ఏ కార్యకర్త మీద ఎక్కువ కేసులు ఉంటాయో వారికి నామినేట్ పదవులు ఇస్తామని కార్యకర్తలను రెచ్చగొట్టారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించి అల్లర్లు సృష్టించే విధంగా ప్రేరేపిస్తున్న నారా లోకేష్ పై చర్యలు తీసుకోవాలి' అని వైఎస్సార్‌సీపీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం సాయంత్రం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో జేసీఎస్ కన్వీనర్ నాగేంద్ర, మార్కెట్ యార్డు డైరెక్టర్ శ్రీనివాస్ నాయకులు ప్రకాష్‌గౌడు, ఆంజినేయులు, మహంతేష్ తదితరులు ఫిర్యాదు చేశారు.

పేదల ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

- ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ


సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర నారాయణ

గోరంట్ల: 'ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల అభ్యున్నతి కోసం పనిచేస్తోంది. వచ్చే ఎన్నికల్లో మరోసారి పేదల ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలి' అని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ పేర్కొన్నారు. మండలంలోని వానవోలు తండా పంచాయతీ పరిధిలోని ముత్తరాయునితండా, గుంటిపల్లితండా, వానవోలు తండా గ్రామాల్లో బుధవారం సర్పంచ్ పార్వతిబాయి నేతృత్వంలో పెనుకొండ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ ఆధ్వర్యంలో గడప గడప కూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే శంకరనారాయణ ప్రతి గడపకూ వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరించారు. అలాగే గ్రామల్లో నెలకొన్న సమస్యలను ప్రజల నుంచి తెలుసుకొని వాటిని సత్వరం పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

బాబు కుట్రలను తిప్పికొట్టండి

ఎమ్మెల్యే శంకరనారాయణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల పేదల సంక్షేమమే లక్ష్యంగా నవరత్నాల పథకాలు తీసుకొచ్చారన్నారు. జాతిపిత మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపనే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్ దేశంలోనే ఎక్కడా లేని విధంగా గ్రామ సచివాలయ వ్యవస్థ తీసుకొచ్చారని పేర్కొన్నారు. గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేయడంతో పాటు వలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టి, కుల, మత రాజకీయలకు అతీతంగా అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. 2014 ఎన్నికల్లో టీడీపీ రాజకీయ లబ్ధి కోసం ఆచారణ సాధ్యంకాని హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా అధికారం చేజిక్కించుకోవాలని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు కుట్రలు, కుతంత్రలు చేస్తున్నారని వాటిని ప్రజలు తిప్పికొటాలన్నారు. కార్యక్రమంలో గోరంట్ల మార్కెట్ యార్డు అధ్యక్షుడు బూదిలి వేణుగోపాల్ రెడ్డి, జిల్లా సహకార బ్యాంకు డైరెక్టర్ పాటూరి శంకరరెడ్డి, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యులు బాషా, వానవోలు సహకార సంఘం అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, సర్పంచ్ శ్రీరాములు, ఉప సర్పంచ్ బాబు, ఎంపీటీసీ సభ్యులు రాఘవేంద్రస్వామి, నాయకులు, రమణనాయక్, జయరాంనాయక్, గాండ్ల మల్లికార్జున, భాస్కరరెడ్డి, ఓబుళరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలుతున్న ఇసుక


ఆర్ కుర్లపల్లి వద్ద ఇటుకుల బట్టీల వద్ద నిల్వచేసిన ఇసుక

రొద్దం: మండల పరిధిలోని ఆర్ కుర్లపల్లి గ్రామ సమీపంలో ప్రైవేట్ వ్యక్తులు సిమెంట్ ఇటుక బట్టీలకు పెన్నానది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. గత ఏడాదిగా భారీగా పెన్నానది నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్నట్లు గ్రామస్తులు వాపోతున్నారు. సిమెంట్ ఇటుక బట్టీలు ఏర్పాటు చేసుకుని వ్యాపారం చేసుకుంటూ అక్రమంగా ఇసుక తరలిస్తుంటే సంబంధిత అధికారులు ఎందుకు వారిపై చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని కోరుతున్నారు. అలాగే ఆర్ కొట్టాల గ్రామ సమీపంలోని కుంటలో నుంచి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై తహసీల్దార్ అనంతచారిని 'సాక్షి' వివరణ కోరగా పెన్నానది నుంచి ఇటుక బట్టీలకు ట్రాక్టర్లతో ఇసుక తోలడానికి ఎవరికీ అనుమతులు ఇవ్వలేదన్నారు. ఎవరైనా సిమెంట్ ఇటుక బట్టీలకు ఇసుక అక్రమంగా తరలిస్తే విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు.

ఓటరు నమోదు పరిశీలన


కల్లూరులో ఓటరు జాబితాను పరిశీలిస్తున్న స్పెషల్ ఆఫీసర్

లేపాక్షి: మండలంలోని కల్లూరు, నాయనిపల్లి, ఉప్పరపల్లి, కంచిసముద్రం గ్రామాల్లో ఓటరు నమోదును స్పెషల్ ఆఫీసర్ సుదర్శనంతో పాటు తహసీల్దార్ బాబు బుధవారం పరిశీలించారు. డబుల్ ఎంట్రీలు , ఒకే డోరు నంబర్లలో ఎక్కువ ఓటర్లు ఉండడంపై వారు ఆరా తీశారు. తప్పులు లేని ఓటరు జాబితా తయారు చేయడానికి అందరు సమన్వయంతో పనిచేయాలన్నారు.

సోలార్ పార్క్ విస్తరణ హర్షణీయం

పావగడ: ఆసియా ఖండం లోనే అతి పెద్దదిగా పేరు పొందిన స్థానిక తిరుమణి సోలార్ పార్క్ విస్తరణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సీఎం సిద్దరామయ్యకు స్థానిక సోలార్ పార్క్ శక్తి స్థల రైతుల క్షేమాభివృద్ధి సంఘం పదాధికారులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రధాన కార్యదర్శి సాంబసదాశివరెడ్డి మాట్లాడుతూ 10 వేల ఎకరాల్లో మరో వెయ్యి మెగా వాట్ల సౌర విద్యుత్ ఉత్పాదన సోలార్ పార్క్ విస్తరణకు సీఎం సిద్దరామయ్య అనుమతి ఇవ్వడం అభినందనీయమన్నారు. ఈ మేరకు ఆయన సోలార్ పార్క్ క్రెడల్ అధికారి ఎండి రుద్రప్పయ్య, కేఎస్‌పీడీసీఎల్ సీఈఓ అమర్‌నాథ్‌కు పుష్పగుచ్ఛం అందించారు.

ఘనంగా రక్షాబంధన్


సామూహిక రక్షాబంధన్ నిర్వహిస్తున్న దృశ్యం

అమరాపురం: మండలంలో రాఖీ పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. సరస్వతి విద్యామందిరంలో విద్యార్థులు సాముహిక రక్షాబంధన్ కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకున్నారు.

లేపాక్షి: మండల కేంద్రంలోని ప్రజాపిత బ్రహ్మ కుమారీలు రక్షా బంధన్ (రాఖీ పౌర్ణమి) వేడుకలను బుధవారం ఉదయం ఘనంగా జరుపుకున్నారు. ఓం బ్రహ్మ కుమారీలు గ్రామ సర్పంచ్ ఆదినారాయణకు రాఖీ కట్టారు.

ఆక్రమణ తొలగింపులో వివాదం


జేసీబీతో డ్రైనేజీకి అడ్డుగా ఉన్న నిర్మాణాలు తొలగించడానికి యత్నిస్తున్న దృశ్యం

హిందూపురం: పట్టణంలోని డీఎల్‌రోడ్డులో కొత్త డ్రైనేజీలు, రోడ్డు నిర్మాణానికి మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. డ్రైనేజీలను ఆక్రమించిన నిర్మాణాలను తొలగించాలని కమిషనర్ ప్రమోద్‌కుమార్ ఆదేశించడంతో బుధవారం టౌన్‌ప్లానింగ్ అధికారులు చర్యలు చేపట్టారు. అయితే కాంప్లెక్స్ యాజమాని తాము స్థలపత్రాల మేరకు నిర్మాణాలు చేసుకున్నామంటూ అభ్యంతరం చెప్పడంతో అధికారులకు స్థల యాజమానులు మధ్య వాగ్వివాదం జరిగింది. మున్సిపల్ వైస్‌చైర్మన్ బలరామిరెడ్డి, వార్డు కౌన్సిలర్ నాగేంద్రబాబు అక్కడికి చేరుకుని పరిస్థితి సమీక్షించారు. పట్టణాభివృద్ధికి సహకరించాలని కోరారు. టౌన్‌ప్లానింగ్ అధికారులతో చర్చించి కొంత సమయం ఇచ్చిపూర్తి హద్దులు పరిశీలించి పనులు చేపట్టాలని అధికారులను సూచించారు. అందరికీ అనుకులమైన రీతిలో అడ్డుగా ఉన్నవాటిని తొలగించి డ్రైనేజీ, రోడ్డు నిర్మాణాలు చేస్తామని అధికారులు చెప్పడంతో సమస్య సద్దుమణిగింది.

'గృహలక్ష్మి'ని సద్వినియోగం చేసుకోండి

పావగడ: గృహలక్ష్మి యోజన కింద ఇంటి ఖర్చులకు ప్రతి కుటుంబ యజమానికి ప్రతి నెలా అందించే రూ.2 వేల ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేష్ మహిళలకు సూచించారు. స్థానిక ఎస్ఎస్‌కే రంగ మందిరంలో బుధవారం నిర్వహించిన గృహ లక్ష్మి యోజన ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. తహసీల్దార్ వరదరాజు, ఈఓ జానకిరాం, మున్సిపల్ ముఖ్యధికారి షంషు తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు ప్రశంసాపత్రాలు


నరేష్


శివ


ఎస్పీ మాధవరెడ్డి నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న వెంకటరెడ్డి

హిందూపురం అర్బన్: పుట్టపర్తి పట్టణంలో సాయి ఆరామంలో ఎస్పీ మాధవరెడ్డి ఆధ్వర్యంలో నెలవారి సమీక్షా సమావేశం నిర్వహించారు. విధుల్లో ప్రతిభ కనబరచిన వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఇందులో భాగంగానే హిందూపురం పట్టణంలోని 1వ పోలీసుస్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుళ్లు వెంకటరెడ్డి, నరేష్, ట్రాఫిక్ కానిస్టేబుల్ శివలకు ప్రశంసాపత్రాలు అందజేశారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

పరిగి:మండల సర్వసభ్య సమావేశాన్ని గురువారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సరస్వతి తెలిపారు. సాధారణ మండల సర్వసభ్య సమావేశంలో భాగంగా ఉదయం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో ఎంపీపీ సవిత అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

మండల వ్యాప్తంగా ఉన్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులతో పాటు ఆయా గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు తప్పక హాజరుకావాలన్నారు. అలాగే మండలస్థాయి అధికారులంతా అభివృద్ధి నివేదికలతో హాజరుకావాలని సూచించారు.

పావగడలో పట్టపగలే చోరీ

పావగడ: పట్టణంలోని పతంజలినగర్ మున్సిపల్ క్వార్టర్స్‌లో బుధవారం పట్ట పగలే చోరీ జరిగింది. ఇంటి యజమాని మోహన్ ఉదయం 11 గంటల సమయంలో తన ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లాడు. ఈ సమయంలో దొంగలు ఇంటి తాళం పగుల గొట్టి లోపలికి బీరువాలోని సుమారు 12 గ్రాముల బంగారు సరం, 500 గ్రాముల వెండి, రూ 5 వేలు నగదు ను అపహరించారు. ఎస్ఐ గురునాథ్ ఆధ్వర్యంలో డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేశారు.

ఇరువర్గాల ఘర్షణ

సోమందేపల్లి: మండలంలోని చెన్నాపురంలో మంగళవారం రాత్రి స్థల వివాదం కాస్తా ఘర్షణకు దారి తీసింది. కురుబ గంగాధర్, గొల్ల దాలప్పలు రెండున్నర సెంటు స్థలం విషయమై గొడవ పడ్డారు. దీంతో గ్రామంలో ఇరు వర్గాలు కర్రలు, రాళ్లతో దాడి చేసుకోగా ఏడుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

వ్యాయామ ఉపాధ్యాయులకు అవగాహన

మడకశిర: స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన వ్యాయామ ఉపాధ్యాయుల సముదాయ సమావేశం బుధవారం సజావుగా సాగినట్లు హెచ్‌ఎం రాఘవయ్య, నియోజకవర్గం ఇన్‌చార్జ్ ప్రకాష్‌రెడ్డి తెలిపారు. వ్యాయామ విద్యలో నైపుణ్యాలను మెరుగు పరచుకోవడానికి ఈ సమావేశం దోహదపడుతుందన్నారు.

ఓం శక్తి ఆలయంలో చోరీ


బీరువాలోని వస్తువులను చిందర వందర చేసిన దృశ్యం

హిందూపురం అర్బన్: మండల పరిధిలోని కిరికెర స్పిన్నింగ్ మిల్ వద్ద వెలసి ఉన్న ఓం శక్తి ఆలయంలో బుధవారం వేకువ జామున దుండగులు ఆలయ సైడ్‌వాల్స్‌గా ఉన్న ఐరన్‌మెష్ షీట్లను తొలగించి చోరీకి పాల్పడ్డారు. బీరువా తలుపులు పగుల గొట్టి అందులోని చీరలు, అమ్మవారికి వాడే వెండి ఆభరణలను చిందర వందరగా పడేశారు. హుండీని పగులగొట్టి అందులోని డబ్బును ఎత్తుకెళ్లారు. నెల రోజుల క్రితం ఇదే ఆలయంలో చోరీకి విఫల యత్నం చేసిన విషయం తెలిసిందే.

కూలీల సంఖ్య పెంచాలి

అగళి: మండలంలోని గ్రామాల్లో ఉపాధి పనులపై అవగాహన కల్పించి కూలీల సంఖ్యను పెంచాలని ఎంపీడీఓ నరేంద్రకుమార్ సిబ్బందికి సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి పనులు, పండ్లు తోటల పెంపకంపై సిబ్బందితో సమావేశం నిర్వహించారు.

తాగునీటి సమస్యకు చెక్

మడకశిర: పట్టణంలోని 17వ వార్డు మారుతీనగర్‌లో కొన్ని నెలల నుంచి తాగునీటి సమస్య ఉంది. కౌన్సిలర్ సుభద్ర చొరవ తీసుకుని కొత్తగా బోరు వేయడంతో నీళ్లు సమృద్ధిగా పడ్డాయి. దీంతో బుధవారం వాటర్ స్కీమ్ బోరులోకి కొత్త మోటారును వదిలారు. శాశ్వతంగా మారుతి నగర్‌లో తాగునీటి సమస్యను పరిష్కరించినందుకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

వృద్ధుడి అదృశ్యం

సోమందేపల్లి: మండలంలోని మంచేపల్లికి చెందిన మాబూసాబ్ అనే వృద్ధుడు అదృశ్యమైనట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. ఈ నెల 24న ఇంటి నుంచి వెళ్లి పోగా ఇప్పటి వరకు ఆచూకీ లభించలేదని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ


పూజల్లో పాల్గొన్న భక్తులు

పెనుకొండ రూరల్: మండలంలోని కొండంపల్లి గ్రామ సమీపంలోని కొండపై కళ్యాణ వేంకటేశ్వర స్వామి దేవాలయ నిర్మాణానికి బుధవారం గ్రామస్తులు భూమి పూజ చేశారు. భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు ఆలయ ధర్మకర్త ఆదినారాయణ గిరి స్వామి తెలిపారు.

ఘనంగా ఉపకర్మ మహోత్సవం

పెనుకొండ: పట్టణంలోని ఆది శంకరాచార్యుల మఠంలో బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఉపకర్మ మహోత్సవం ఘనంగా జరిగింది. ఉపకర్మ పౌర్ణమిని పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహించారు. నూతన ఉపనయనంలో భాగంగా వటువుల చేత ప్రత్యేక పూజలు, హోమాలు చేయించారు.